సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

కౌడిపల్లి , డిసెంబర్ 6 : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు క్యార్యాలయంలో లింగంపల్లి గ్రామానికి చెందిన ఇట్టబోయిన యశోదకు మంజూరైన రూ. 22 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ మాధవ రెడ్డి, బచ్చలి సుధాకర్, నాయకులు ఉన్నారు.

ప్రశ్నించిన వారిపై కేసులా ?

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్

రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌లో మాజీ చైర్మన్ చంద్రాగౌడ్

శివ్వంపేట, డిసెంబర్ 6 : ప్రభుత్వ అసమర్థత విధానాలను ప్రశ్నించే వాళ్లను అరెస్టు చేసి ప్రతిపక్షాల గొంతునొక్కడమేనా ప్రజాపాలనా అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ అన్నారు. గురువారం శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్టుకు నిరసనగా గచ్చిబౌలీ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపగా లాఠీచార్జీ చేసి చంద్రాగౌడ్‌ను అరెస్టు చేసి రామచంద్రాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అక్రమ అరెస్టుకు నిరసనగా కలవడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, కేసీఆర్ నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని అన్నారు.

కోర్టు ఆదేశాలు హర్షణీయం

చిలిపిచెడ్, డిసెంబర్ 6 : మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్టు చేయొద్దని ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో హరీశ్‌రావును అరెస్టు చేయడం సిగ్గుచోటు అన్నారు. దీంతో హైకోర్టు సానుకూలంగా స్పందించి ఆయనను అరెస్టు చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేయడంపై న్యాయమే గెలుస్తుందని స్పష్టమైందన్నారు. అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేయడం కాంగ్రెస్ నైజమన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్ ఎండీ క్షితిజ

మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎండీ క్షితిజ

రామాయంపేట, డిసెంబర్ 6: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ ఎండీ క్షితిజ పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేట పట్టణంలోని న్యాక్ ఆధ్వర్యంలో వంద రోజుల పాటు కుట్టుశిక్షణను పొందిన 50 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం అధికారి మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ అధ్వర్యంలో కోనాపూర్, ప్రగతి ధర్మారం గ్రామాలలో న్యాక్ శిక్షణలో భాగంగా రెండు గ్రామాల్లో వంద రోజుల పాటు 50మంది మహిళలకు శిక్షణను ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం శిక్షకులకు సర్టిఫికెట్లతో బాటు ఉచితంగా కుట్టు మిషన్లను అందజేసినట్లు తెలిపారు. న్యాక్ ఏడి.రాము, విద్యాసాగర్, మల్లేశం, తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు మహిళా వినియోగదారుల సహకార సంఘం వైస్ చైర్‌పర్సన్ కీర్తన

నియామకపత్రాన్ని అందుకుంటున్న కల్లూరి కీర్తన

శివ్వంపేట, డిసెంబర్ 6 : తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహిళా వినియోగదారుల సహకార సంఘం రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్ శివ్వంపేట మండలం ఏదుల్లాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కల్లూరి కీర్తన హనుమంతరావు ఎన్నికయ్యారు. తెలంగాణ మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయ వినియోగదారుల సహకార సొసైటీ సంఘం నూతన కార్యవర్గ సమావేశం రాష్ట్ర అపెక్స్ కమిటీ చైర్మన్ పుట్టం పురుషోత్తమరావు ఆధ్వర్యం లో సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి గ్రామ శివారులోని వీపీజే ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సమావేశంలో మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి హనుమంతరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలంగాణ మున్నూరు కాపు సంఘం మహిళలు పాల్గొన్నారు.

బాలికకు మెరుగైన వైద్యం అందజేస్తాం

కస్తూర్బా ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రామాయంపేట, డిసెంబర్ 6 : ప్రమాదశాత్తు భవనం మెట్లపై నుంచి కాలుజారి కిందపడి కాలు విరిగిన బాలికకు మెరుగైన వైద్య సాయం అందిస్తున్నామని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేట పురపాలిక పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదోతరగతి చదువుతున్న బాలిక రేణుక రెండు రోజుల కింద భవనంపైకి వెళ్లి తిరిగి వస్తుండగా మెట్లపై నుంచి జారి కిందపడిందన్నారు. బాలికను రామాయంపేటలో చికిత్స నిర్వహించి అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో మెరుగైన చికిత్సలను అందిస్తున్నామని విద్యాధికారి తెలిపారు. పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులను సముదాయించి మెరుగైన చికిత్సలు చేయాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం గాంధీ దవాఖాన సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడాడని ఆందోళన చేస్తున్న గ్రామస్తులకు తెలిపారు. కులుంబీకులు, గ్రామస్తులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం విద్యాధికారి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన వంటశాలను, హాస్టల్ గదులను పరిశీలించి టీచర్లును, విద్యార్థులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి

రైతులకు మందులు అందజేస్తున్న వైద్యాధికారి నాగార్జున

పెద్దశంకరంపేట, డిసెంబర్ 6 : పాడి రైతులు తమ పశువుల పెంపకం పోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగార్జున పాటిల్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని వీరోజిపల్లి గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువులకు గర్భస్థ పరీక్షలు నిర్వహించి తగిన మందులు ఉచితంగా అందజేశామన్నారు. ప్రతి పశువుకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, గోపాల మిత్ర జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, మహేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మెదక్: బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి

మెదక్ జిల్లా వ్యాప్తంగా నివాళులర్పించిన నేతలు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని పలువురు నేతలు కోరారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమని, దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

-మెదక్ జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, డిసెంబర్ 6

చిలిపిచెడ్‌లో నివాళులర్పిస్తున్న ఎస్సై నర్సింహులు, అంబేద్కర్ సంఘం సభ్యులు

రామాయంపేట : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏబీవీపీ విద్యార్థి నాయకులు

నిజాంపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు

వెల్దుర్తి : మాసాయిపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్

చిన్నశంకరంపేట, డిసెంబర్ 6 : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పెట్టాలని వసతి గృహం నిర్వాహకులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని ఆదర్శ పాఠశాలను పరిశీలించి పదో తరగతి విద్యార్థులకు పాఠాలను బోధించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 105 ప్రభుత్వ వసతి గృహాలను ప్రత్యేక అధికారులు సందర్శించారని వారు వసతిగృహాల్లో కూరగాయల నిల్వ, వంటపాత్రలను పరిశుభ్రం చేయడం, విద్యార్థులకు ఎలా వడ్డిస్తున్నారు. వంటి అంశాలను పొందుపరిచి నివేదిక అందించినట్లు ఆయన తెలిపారు. వెంట తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్ ఉన్నారు.

గృహజ్యోతిని వినియోగించుకోవాలి

కలెక్టర్ రాహుల్ రాజ్

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : గృహ జ్యోతి పథకం విద్యుత్ వినియోగదారుల పాలిట వరమని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గృహ జ్యోతి పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 26 వేల గృహాలకు 31.36 కోట్ల వరకు గృహ జ్యోతి విద్యుత్ వినియోగదారులు వినియోగించుకున్నారని, ఇంకను 12,000 మంది గృహ జ్యోతిలో నమోదు కావాల్సి ఉందని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులు నియమించి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్, డీఈ చాన్ షరీఫ్ బాషా, తూప్రాన్ డీఈ గరుత్మంత రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ఉపాధి' పనులు చేపట్టాలి

చిలిపిచెడ్‌లో పజాదర్బార్‌లో తప్పలను చూపుతున్న అధికారులు

చిలిపిచెడ్, డిసెంబర్ 6: గ్రామాల్లో ఉపాధిహామీ పని కోసం దరఖాస్తు చేసే ప్రతి వ్యక్తికి ఉపాధిహామీ జాబ్ కార్డులు అందజేయాని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఈజీఎస్ ఏపీడీ రఘుచార్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిలిపిచెడ్ ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆనంద్ సమక్షంలో 2023-24 మార్చి 31 వరకు సంబంధించిన ఉపాధిహామీ పనులపై ప్రజాదర్బార్ నిర్వహించారు. రెండు వారాలుగా గ్రామాల్లో సామాజిక తనిఖీ సిబ్బంది ఉపాధిహామీ పనులపై సేకరించిన నివేదికను ఏపీడీ రఘుచార్యలు, జిల్లా విజిలెన్స్ అధికారి జ్యోతి అధ్యర్యంలో ప్రజాదర్బార్‌లో వెల్లడించారు. కార్డు ఉన్న రైతులకు కోళ్లఫాం, గొర్రె, మేకల షెడ్లు,పండ్లు తోటలు,బర్రెల షెడ్లు, చాపల చెరువుల కోసం దరఖాస్తు పెట్టిన వెంటనే మంజూరు చేయాలన్నారు. అధికారులు హెచ్ఆర్ రాజేంద్రర్,ఎస్ఆర్పీ జీవన్, పీఆర్ ఏఈ మధుబాబు,ఏపీవో శ్యామ్‌కుమార్, ఈసీ భగవాన్‌రెడ్డి, టీఏలు, ఎఫ్ ఏలు ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్‌లో వదిలివేసిన వాహనాలను తీసుకెళ్లాలి

మెదక్ అర్బన్, డిసెంబర్ 6 : మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వదిలివేసిన వాహనాలను తీసుకెళ్లాలని పోలీసులు సూచించారు. నంబర్ ప్లేట్ లేకుండా వదిలివేసిన వాహనాలకు సంబంధంచిన ఒరిజనల్ పత్రాలు తీసుకొని మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో చూపించి తీసుకెళ్లాలని శుక్రవారం మెదక్ పట్టణ సీఐ తెలిపారు. మొత్తం 20 ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

వృత్తి విద్యపై అవగాహన కలిగి ఉండాలి

పద్మాలయ నర్సింగ్‌హోమ్ లో వృత్తి విద్యా సేవలపై శిక్షణ అందిస్తున్న సిబ్బంది

రేగోడ్, డిసెంబర్ 6 : మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ ఇండస్ట్రియల్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం వృతింత విద్యపై అవగాహన కల్పించారు. పెద్దశంకరంపేట పద్మాలయ నర్సింగ్ హోమ్ దవాఖాన వారి సహాయంతో ఫీల్డ్ అవగాహన సదస్సు నిర్వహించామని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. వృత్తి విద్యాకమిషన్ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. అవగాహన కోసం ఫీల్డ్ ట్రిప్ పెద్దశంకరంపేటకు విద్యార్థులను తీసుకువెళ్లామని తెలిపారు.

శరవేగంగా ఆలయ నిర్మాణం

వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన ద్వార స్థాపన

పెద్దశంకరంపేటలో ఆలయం వద్ద పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

పెద్దశంకరంపేట, డిసెంబర్ 6 : పెద్దశంకరంపేట పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పునర్మిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం ఆలయ ధర్మకర్తలు ఆలయ ప్రధాన ద్వార స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణలతో ఆలయ పునర్మిర్మాణ పనులు చేపట్టారు. 250 ఏండ్ల కింద ఉన్న వేణుగోపాల స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో రూ. 2 కోట్ల వ్యయంతో తమిళనాడు శిల్పులతో నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ఆలయంలో ప్రతి యేటా వైకుంఠ ఏకాదశి, శ్రీక్రిష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. త్వరలో ఆలయని ర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆలయ ధర్మకర్తలు రామచంద్రాచారి, వేణుగోపాల్, మురళీ పంతులు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో యజ్ఞం

అయ్యప్ప ఆలయంలో హోమం చేస్తున్న స్వాములు

రామాయంపేట, డిసెంబర్ 6 : అయ్యప్ప ఆలయంలో స్వాములు పూజా కార్యక్రమాలను చేపట్టారు. శుక్రవారం స్వామి వారి సన్నిధిలో హోమాలను నిర్వహించి స్వామికి అభిషేకాలు, నైవేద్యాలను సమర్పించి మంగళ హారతులు సమర్పించారు. ఆలయ సన్నిధిలో భక్తులు పాటలు పాడుతూ భజనలు చేశారు. అయ్యప్ప స్వామివారిని పూలతో అలంకరించి దేదీప్యమానంగా వేద బ్రాహ్మణులతో పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

అయ్యప్ప ఆలయానికి భూమిపూజ

నిజాంపేట, డిసెంబర్ 6 : మండలంలోని నస్కల్‌లో నూతనంగా నిర్మించనున్న అయ్యప్పస్వామి ఆలయానికి స్థానిక స్వాములు శుక్రవారం భూమిపూజ చేశారు. స్వాములు భీమయ్య, ఎర్రగౌడ్, లక్ష్మాగౌడ్, సిద్ధిరాములు, వెంకటస్వామి, శ్రీనివాస్‌గౌడ్, సంతోశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

నిజాంపేట మండలంలోని చల్మెడలో మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి స్వామి స్వగృహంలో మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వాములు రంజిత్‌గౌడ్, రవీందర్, యాదగౌడ్, రమణ పంతులు, వెంకటేశ్ గౌడ్, నవీన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రఘు,మధు, నవీన్‌గౌడ్, స్వామిగౌడ్, భాస్కర్‌రావు, మహేందర్, మహేశ్, రాజు, నగేశ్, తదితరు ఉన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరాలి

స్వెటర్లు పంపిణీ చేస్తున్న న్యాయవాది శివకుమార్‌గౌడ్

శివ్వంపేట, డిసెంబర్ 6 : విద్యార్థులందరూ పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని అశోక్‌కుమార్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం శివకుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాంబండ ఉన్నత పాఠశాల విద్యార్థులందరికీ చలికాలం స్వెటర్లు శివకుమార్‌గౌడ్ చేతులమీదుగా అందజేశారు. హెచ్ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు వామనశర్మ, శ్రీధర్ రావు, వేణుగోపాల్‌రెడ్డి, సదన్ కుమార్, చెన్నానాయక్, జగదీశ్వర్, శ్రీవాణి, విశ్వశ్రీ లా చాంబర్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి భూమిపూజ

శివ్వంపేట మండలం గూడురులో పురాతన శ్రీసోమేశ్వరాలయం వద్ద అదేగ్రామానికి చెందిన ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులు పెద్దగౌని లింగయ్యగౌడ్-అంజమ్మల జ్ఞాపకార్థం అన్నదాన సత్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. శుక్రవారం భూమిపూజ చేశారు. అర్చకులు రాజశేఖరశర్మ, కములయ్యగారి సత్యనారాయణ, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

చిన్నశంకరంపేట, డిసెంబర్ 6 : మండల పరిధి మడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థి అంకిత జాతీయ స్థాయి వాలీబాల్ ఆటకు ఎంపికైనట్లు శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల చేగుంట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ ఆటలో అంకిత అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ఎంపికైంది. ఈనెల 10,14తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో జరగబోయే జాతీయస్థాయి వాలీబాల్ ఆటలో అంకిత పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు నరేశ్ తెలిపారు. సిబ్బంది అభినందించారు.

గౌడన్నలు హక్కులను కాపాడుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న గౌడ జన హక్కుల అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్

కౌడిపల్లి , డిసెంబర్6 : గౌడన్నలు సంఘటితంగా ఉండి మన హక్కులను కాపాడుకోవాలి. రాజకీయంగా ఎదిగినప్పుడే మన వృత్తితో పాటు మన హక్కులను కాపాడుకోగలుగుతామని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లి రేణుకా ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి చంద్రం దుర్గాగౌడ్, మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్, సంఘం నేతలు పాల్గొన్నారు .

నేడు సీజ్ చేసిన ఇసుక డంప్‌లు వేలం

చిలిపిచెడ్, డిసెంబర్ 6 : మండలంలోని బండపోతుగల్‌లో మంజీరా నది నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను తహసీల్దార్ ముసావుద్దీక్ సీజ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు మండలంలోని బండపోతుగల్ గ్రామ పంచాయతీ వద్ద సీజ్ చూసిన ఇసుకను వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వరి కొయ్యలను కాలిస్తే ముప్పు

అల్లాదుర్గం, డిసెంబర్ 6 : పంట కోతలు అయిన తర్వాత వరి కొయ్యలను కాల్చడంతో వాయు కాలుష్యం, నేల కాలుష్యం జరుగుతున్నదని మండల వ్యవసాయ అధికారి రాజేశ్ అన్నారు. శుక్రవారం మండంలోని రెడ్డిపల్లిలో వరి కొయ్యల కాల్చడంపై రైతులకు అవగాహన కల్పించారు. కొయ్యలను నేలపై కాల్చడం వల్ల నేలలోని పోషకాలు నాశనమవుతాయని, మొలకలను కాల్చడం ద్వారా ఉత్పన్నమయ్యే వేడి మట్టిలోకి చొచ్చుకుపోతుందన్నారు. ఏఈవోలు నవీన్, అమృత్, విఠల్ రావు, రైతులు బేతయ్య, సాయిలు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ చర్చికి పాదయాత్ర

పాదయాత్రగా వెళ్తున్న పాస్టర్ సామెల్

చిలిపిచెడ్, డిసెంబర్ 6 : మండలంలోని చిట్కుల్ గ్రామ పాస్టరేటు నుంచి మెదక్ చర్చికి పాదయాత్రగా వెళ్తున్నట్లు చిట్కుల్ చర్చి పాస్టర్ సామెల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిట్కుల్ పాస్టరేట్ చర్చి నుంచి సుమారుగా వంద మంది క్రిస్టయన్స్‌తో జిల్లా కేంద్రమైన మెదక్ మహా దేవాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వెళ్తున్నట్లు పాస్టర్ సామెల్ తెలిపారు. ఈ శతాబ్ది ఉత్సవాల్లో భక్తులు అందరూ పాల్గొన్ని విజయవతం చేయాలని కోరారు.

డ్రైవర్‌కు ఎస్సై అభినందన

రామాయంపేట, డిసెంబర్ 6 : నాలుగు రోజుల కింద ఓ మహిళను నమ్మించి కల్లు తాగించి ఆమె వద్ద ఉన్న నగలు, నగదు దోచుకొని ఆటోలో బస్టాండ్ వద్ద దింపి ఉడాయించిన భార్యాభర్తలను పట్టించిన ఆటో డ్రైవర్ మహిపాల్‌ను ఎస్సై బాలరాజు అభినందించారు. శుక్రవారం ఆటో డ్రైవర్ మహిపాల్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిచి ప్రశంసాపత్రం అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అల్లాదుర్గం, డిసెంబర్ 6 : అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింహులు, మాజీ మండల అధ్యక్షుడు మోహన్ రాథోడ్, ఆశయ్య, నర్సప్ప, తదితరులు పాల్గొన్నారు.

8న రామాయంపేటలో వైద్య శిబిరం

రామాయంపేట, డిసెంబర్ 6 : ఈనెల 8న రామాయంపేట సత్యసాయి సేవా సదనంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పురపాలికతో బాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై చికిత్సలు నిర్వహించు కోవాలని ట్రస్టు నిర్వాహకులు యాచం శంకరయ్య గుప్తా, గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం రామాయంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఆరోగ్య శిబిరం ఏర్పాటుపై ఆటోలో వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఉచితంగా మందులు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

జీవో 317 ను రద్దు చేయాలి

నిజాంపేట, డిసెంబర్ 6 : ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి జీవో 317ను రద్దు చేయాలని తపస్ జిల్లా మహిళా ఉపాధ్యాక్షురాలు సుకన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి కేవలం 48 గంటల్లోనే జీవో 317ను రద్దు చేస్తానని మాట ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చాక నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం నిజాంపేట మండలంలోని రాంపూర్ ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ప్రధానోపాధ్యయుడు పద్మారెడ్డి,ఉపాధ్యాయులు అర్జున్, చంద్రకాంత్, నరేశ్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.